క్లుప్తంగా

మల్టీపర్పస్ వర్కర్లకు వైద్య పరీక్షలు



గద్వాల రూరల్: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ బస్తీ దవాఖానాలో వైద్యురాలు ఎంజెల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీఓ చంద్రకళ మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా మల్టీపర్పస్ వర్కర్లకు వైద్య పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శేఖర్, వెంకటలక్ష్మి, శారద, శశికళ ఉన్నారు.

'సేవలే చిరస్థాయిగా గుర్తుంటాయి'



గద్వాల అర్బన్: ప్రతి ఉద్యోగికి పదవి వీరమణ తప్పదని, ఉద్యోగ సమయంలో అందించిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఏంఏఎల్డీ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషా అన్నారు. ఏంఏఎల్డీ డిగ్రీ కళాశాల ఏఓ మక్బూల్‌అహ్మద్, కామర్స్ లెక్చరర్ శివారెడ్డి సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధి పథంలో పయణించడానికి వీరి పాత్ర మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా వారిని పూలమాల, శాలువాతో సన్మానించారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివ లింగానికి అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజ స్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి స్వామి వారిని దర్శించుకున్నారు. పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



గట్టు: గ్రామ స్వరాజ్యం కమ్యూనిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని ఈ పోటీలను చేపట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం గ్రామ స్వరాజ్యం ద్వారా సాధ్యం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హృదయరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేఎస్డీ రాజు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ



అయిజ: తైక్వాండాలో అయిజ మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ జోనల్ లెవల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 17 విభాగంలో జశ్వంత్, రాంతేజ్, అండర్ 19 విభాగంలో రోహిత్ స్మిత్, వీరేష్, పరుశ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పలువురు ప్రముఖులు ప్రశంసలు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



శాంతినగర్‌లో బతుకమ్మలతో విద్యార్థులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో సోమవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ పేరు చెప్పగానే బతుకమ్మ పండుగ గుర్తుకు వస్తుందన్నారు. అనంతరం చిన్నారులు వివిధ నృత్య ప్రదర్శనలు చేశారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామాంజనేయులు ఉన్నారు.

శాంతినగర్‌లో..

శాంతినగర్: పట్టణంలోని శివశివానీ హైస్కూల్లో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మను తయారుచేశారు. అన్నింటిని ఒక చోట చేర్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ బొడ్డెమ్మ వేస్తూ పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. విద్యార్థులు కోలాటాలతో ఆకట్టుకున్నారు. అనంతరం రాజోళి సమీపంలోని తుంగభద్రనదిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరి, కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందస్తుగా దసరా ఉత్సవాలు

అయిజ: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు దసరా పండుగ సంబరాలను, బతుకమ్మ వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. నాటకాలను ప్రదర్శించారు. ఆటాపాటలతో సందడి చేశారు.



రంగురంగుల బతుకమ్మతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



అక్షర పాఠశాలలో నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

గద్వాల అర్బన్: నడిగడ్డ ప్రాంతం నుంచి మత్తు పదార్థాలను తరిమికొడదామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. మత్తు పదార్థాల బహిష్కరణ కోసం నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో ఒక్కరోజు నిరహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులుతో పాటు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడిగడ్డలోని చాలా గ్రామాల్లో నిషేధిత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు రాజ్యమేలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ కల్లులో అల్ప్రాజోలం, సీహెచ్, డైజోఫాం కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్నారని, మత్తు పదార్థాలతో కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. జిల్లాలో మత్తు పదార్థాలను బహిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, దీనిపై సంబంధిత అధికారులు ఎలాంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యతగా పని చేసి సమాజ హితానికి పాటుపడాలని కోరారు. మత్తు పదార్థాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి త్వరలోనే భవిష్యత్ కార్యచరణ రూపొందిచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, రంగస్వామి, లవన్న, వెంకట్రాములు, శ్రీనివాస్ యాదవ్, విష్ణు తదితరులు ఉన్నారు.

పౌర హక్కులను కాపాడాలి



మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పౌరహక్కుల దినోత్సవానికి ఆర్ఐ నాగిరెడ్డి, ఏఎస్ఐ ఈశ్వరయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, కుల వివక్ష పాటించడం చట్టరీత్యా నేరమన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, చిన్నకిష్టన్న, రంగన్న, వెంకటన్న, సవారన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతోనే భూగర్భజలాల పెంపు



మల్దకల్: ఇంకుడు గుంతల ఏర్పాటుతోనే భూగర్భజలాలు పెరుగుతాయని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఏపీఓ సుజాత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్మించిన ఇంకుడు గుంతలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకుడు గుంతల వలన భూగర్భజలాలు పెరిగి నీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో టెక్నీకల్ అసిస్టెంటు నాగరాజు, అనూష, ఇబ్రహీం, ఉమేరా తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



రంగాపురంలో ప్రార్థన చేయిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

కేటీదొడ్డి: మండలంలోని రంగాపురం, యూపీఎస్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. సోమవారం ఉదయం 10 గంటల వరకు ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా విధులకు హాజరు కాలేదు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు ప్రార్ధన చేసి, తరగతి గదిలో వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితి ప్రతి రోజు జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమయపాలన నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయులు ఉదయం లేట్‌గా వచ్చి సాయంత్రం తొందరగా ఇంటి బాట పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా.. ఉపాధ్యాయులు 5 నిమిషాలు లేటుగా వచ్చినట్లు ఆయన తెలిపారు. మండలంలోని మిగతా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదనే సమాచారం వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మల్దకల్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ నాగరాణి



శాంతినగర్‌లో..

మల్దకల్: గర్భిణులు, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నాగరాణి సూచించారు. పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మల్దకల్, గట్టు, అయిజ అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణి, బాలింతలు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలను తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారం అందిస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకునే విధంగా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యామిని, సంధ్యారాణి, తెల్లమ్మ, వాసంతి, వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, మహేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ, పుష్పమ్మ, లక్ష్మీరంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

శాంతినగర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సోషల్ మొబలైజర్ లత అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పుష్పావతి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు పోషకాహారం తీసుకోవాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, పోషణ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలు చేయొద్దని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి

అయిజ: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాల శాఖ సహాయ పర్యవేక్షకుడు ఎల్. సదానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్న తాండ్రపాడులో తపాలా శాఖ పొదుపు, జీవిత బీమా, ప్రమాద బీమా గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ పథకాలు గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సమ్మాన్, బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, బాలురకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, గ్రామీణ తపాలా జీవిత ఐపీపీబీ, ప్రమాదబీమా పథకాల ద్వారా అందించబడే అన్ని సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సదానాయక్

కార్యక్రమలో ఐపీపీబీ మేనేజర్ సజ్జన్, నారాయణ, పీఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బుజ్జమ్మ, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వెంకటరాములు, ఏబీఎం చిన్న తాండ్రపాడు సుధాకర్, ఎంఓ రామన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలి

అలంపూర్: టోల్‌ప్లాజాలో తొలగించిన ఉద్యోగిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉండవెల్లి మండల సీఐటీయూ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ అధ్వర్యంలో టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి మాట్లాడుతూ టోల్‌ప్లాజాలో పని చేస్తున్న హుసేన్‌భాషను ఆకారణంగా విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. పీఠర్, ప్రధాన కార్యదర్శి మద్దయ్య, ఆఫీస్ బేరర్స్ రాజశేఖర్, వెంకటేష్, లాజర్, వెంకట్రాముడు, కమిటీ సభ్యులు, ఉద్యోగులు ఉన్నారు.

నిషేధిత జాబితాలోకి ఆలయ భూములు

సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలో ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఈనెల 14న సాక్షిలో 'ఆలయ భూములకు రక్ష ణేదీ' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో వెలసిన ఈశ్వరస్వామి ఆలయానికి చెందిన 46 ఎకరాల భూములను అమ్మకాలు, కొనుగోలు కాకుండా నిషేధిత జాబితాలో చేర్చారు. దేవాలయ భూములను కాపాడాలని బీజేపీ నాయకులు, గ్రామయువకులు సోమవారం తహసీల్దార్ ప్రభాకర్‌ను కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలయ భూములను నిషేధిత జాబితాలోకి చేర్చినట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు, భక్తులు, యువకులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, మండల అధ్యక్షుడు నరసింహ, టౌన్ అధ్యక్షుడు ఆర్‌కే నాయుడు, వెంకటేష్, ఆంజనేయులుగౌడ్‌లు ఉన్నారు.



ధరణిలో నిషేధిత జాబితాలోకి మార్చిన పత్రాన్ని నాయకులకు చూపుతున్న తహసీల్దార్ ప్రభాకర్

ర్యాలీని విజయవంతం చేయండి

గద్వాల రూరల్: గతేడాది సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు జీఓ నంబర్ 317తో స్థానికత కోల్పోయిన పంచాయతీ కార్యదర్శులకు స్థానికత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్ల నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి చాలా మంది పంచాయతీ కార్యదర్శులకు బాసర జోన్‌కు సుమారు 450 కిలోమీర్ల దూరంలో బదిలీ చేశారని వాపోయారు. 2న హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి సెక్రెటరియేట్ వరకు మహాశాంతి ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. జీఓ నంబర్ 317తో నష్టపోయిన బాధిత పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్, రవి, ప్రకాష్ రెడ్డి, వెంకటేష్, రాములు తదితరులు ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

గద్వాల క్రైం: మహిళ పట్ల అనుచితంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మండలానికి చెందిన బీరప్ప ఓ వివాహితతో అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

కిరాణాదుకాణంలో చోరీ..

గద్వాల క్రైం: కిరాణ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. రాఘవేంద్ర కాలనీకి చెందిన తిరుమల్ ఇంటి సమీపంలో కిరాణ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అయితే గుర్తు తెలియని దుండగులు షెట్టర్ పైకప్పును తొలగించి షాపులో ఉన్న రూ.18వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ కళ్యాణకుమార్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి: మండలంలోని కోదండాపురం గ్రామానికి చెందిన అడవి రాముడు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ కోదండపురానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహనాయుడు, పుల్లారెడ్డి, తిరుపతి, వెంకటేష్, మహేష్, రామాంజనేయులు, నాగరాజు, వెంకట్రాముడు, తదితరులు ఉన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో అభ్యర్థి ప్రతిభ



అయిజ: డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని కుటుకనూరుకు చెందిన అభ్యర్థి శ్రీనివాసులు హిందీ పండిట్ విభాగంలో జిల్లా ప్రథమ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని పలువురు శ్రీనివాస్‌ను అభినందిచారు.

ఎస్‌జీటీ పోస్టుకు ఎంపిక

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన విశ్వేశ్వర్‌రావు డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 22 వ ర్యాంకును సాధించి ఎస్‌జీటి పోస్టుకు ఎంపికయ్యాడు. యువకుడిని గ్రామస్తులు అభినందించారు.

ప్రత్యేక బస్సులు

వనపర్తి రూరల్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణా పరమైనా ఇబ్బందులు తలెత్తకుండా మంగళవారం నుంచి ఈ నెల 11 వరకు ప్రతి రోజు 10 ప్రత్యేక బస్సులు ఎంజీబీఎస్ నుంచి వనపర్తికి నడపునున్నట్లు వనపర్తి ఆర్టీసీ డీఎం వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే వివాహాది శుభకార్యాలకు, విహార యాత్రలకు సురక్షితమైన, సఖవంతమైన ప్రయాణంతో అతి తక్కువ అద్దెతో ఆర్టీసీ బస్సులు నడుపుతామని, ప్రతి బుకింగ్‌పై 10 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

మానవపాడు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ అసిస్టెంట్ సర్దార్‌మియ్య తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దఆముదాలపాడులో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులో బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన సుధాకర్ గౌడ్ స్పందించి సొంత ఖర్చులతో సోమవారం రోడ్డుపై ఏర్పడిన గుంతలకు పూడ్చివేయించారు. అనంతరం గ్రామస్తులు సుధాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలు పూడ్చివేత



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి కోయిల్‌దిన్నెకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో ఎర్రమట్టితో గుంతలను పూడ్చి లెవలింగ్ చేశారు. రామచంద్రానగర్, రామాలయ వీధి, కోయిల్‌దిన్నె గ్రామాల ప్రజలతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



గట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద యువజన ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గెలుపొందిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి, గట్టు ప్రిన్సిపాల్ హృదయరాజు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేఎస్‌డీ రాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.